
సాక్షి నంద్యాల

సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024



సం'దేహం'.. రోగ భయం!

సోషల్ మీడియా పోస్టులతో ఆరోగ్య అవలక్షణాలను భూతద్దంలో చూస్తూ ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. తమకు ఏదో అయ్యిందని ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. 8లో▸



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,632
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 34,983
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	: 34,743

న్యూస్‌రీల్

గో సంరక్షణ నిధికి రూ.2లక్షల విరాళాలు



విరాళాన్ని అందజేస్తున్న దాత చంద్రశేఖర బసన్నగౌడ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి పలువురు భక్తులు రూ.2 లక్షల విరాళాలను అందజేశారు. దేవస్థానం నిర్వహిస్తున్న గోసంరక్షణనిధి పథకానికి శనివారం కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన చంద్రశేఖర బసన్న గౌడ రూ.1,00,116, ఆదివారం కడపకు చెందిన పి.మల్లికార్జునరెడ్డి రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. విరాళాలు అందించిన దాతలకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డుప్రసాదాలు అందజేసి సత్కరించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల(అర్బన్): స్థానిక కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) ద్వారా వినతులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. వినతుల స్వీకరణకు ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

మల్లారెడ్డి కుంటకు గండి

- 100 ఎకరాల్లో పంట నష్టం



గండి పడి వృథా అవుతున్న నీరు

చాగలమర్రి: చిన్నవంగలి గ్రామంలోని మల్లారెడ్డి కుంటకు ఆదివారం గండి పడింది. తెలుగంగ ప్రధాన కాల్వకు పరిమితికి మించి నీరు విడుదల చేయడంతో ఆ నీరంతా కుంటకు చేరి గండి పడినట్లు తెలుస్తోంది. కుంట నుంచి వృథా అవుతున్న నీరు సమీపంలోని చిన్నవంగలి, వైఎస్సార్ జిల్లా బయనపల్లె గ్రామాల్లోని 100 ఎకరాల పంటను ముంచెత్తింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుంట కరకట్టల మరమ్మత్తులు చేశారు. కాగా తెలుగంగ ప్రధాన కాలువకు పరిమితికి మించి నీటిని విడుదల చేయడంతో సీపేజ్ వాటర్‌తో కుంట పొంగి పార్లుతోంది. దీంతో కుంట గట్టు కోతకు గురై నీరంతా పంట పొలాలను ముంచెత్తింది. అధికారులు వెంటనే గండిని పూడ్చి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

మద్దిలేటయ్యకు పోటెత్తిన భక్తులు

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం శివార్లలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భాద్రపదమాసం శనివారం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనార్థం భక్తులు తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారికి ప్రీతి పాత్రమైన వరపూజ, ఆకుపూజ, నిర్వహించారు. భక్తుల వివిధ సేవల ద్వారా రూ.1,30,985 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు. అలాగే బనగానపల్లె మండలం పాతపాడు గ్రామానికి చెందిన మధు ఖగస్, మధు సాయి రోహిత్, శ్రావ్యలు అన్నదాన సత్రం ఆధునీకరణకు రూ.55, 555 విరాళం అందజేశారు.

వచ్చాడయ్యో స్వామి..!

- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- జిల్లాలో దాదాపు 3,500 విగ్రహాల ఏర్పాటు
- వెల్లివిరిస్తున్న ఆధ్యాత్మిక శోభ




ఉత్సాహంగా.. కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లె మిట్ట వీధిలో భక్తుల సందడి

భక్త కోటిని దీవించేందుకు బొజ్జ గణపయ్య తరలివచ్చాడు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన మండపాల్లో కొలువుదీరి అభయమిస్తున్నాడు. విభిన్న ఆకృతులతో రూపొందించిన వైవిధ్యభరితమైన విగ్రహమూర్తులు నిత్యపూజలు అందుకుంటున్నాయి. జిల్లాలో వినాయక చవితి సంబరాలు శనివారం షురూ అయ్యాయి. జైజై గణేశా.. జయములివ్వు గణేశా అంటూ వాడవాడలా వినాయకుడి పాటలు, శ్లోకాలు మారుమోగుతున్నాయి. మండపాల వద్ద భక్తుల సందడి హోరెత్తుతోంది.



సుగంధ గణపతి.. నంద్యాల సంజీవనగర్ రామాలయంలో వాల్నట్, జాపత్రి, మొగ్గ, అనాసపువ్వు, దాల్చిన చెక్క తో నెలకొల్పిన పంచముఖ మహాగణపతి



మయూర వాహనాధీశా.. నంద్యాల పప్పుల బట్టి బజార్‌లో వెలసిన లక్ష్మీ గణేష్



లంబోదరుడు.. డోన్ కొండపేట లారీడ్రైవర్స్ యూనియన్ వీధిలో నెలకొల్పిన గణనాథుడు



నంద్యాల సంజీవ్‌నగర్‌లోని సత్యసాయి కల్యాణ మండపం వద్ద భారీ గణపతి



ఆత్మకూరులో ఆకట్టుకుంటున్న వినాయక విగ్రహం

నంద్యాల(వ్యవసాయం): జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి వేడుకల సంబరాలు అంబరాన్నంటాయి. శనివారం అట్టహాసంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి వీధిలో నాలుగైదుకు పైగా గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉదయం, సాయంత్రం స్వామి వారికి పూజలు చేస్తున్నారు. ప్రతి వీధిలో గణేష్ పండుగ సందడి కనిపిస్తోంది. గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు చిన్నారులకు ఆటల పోటీలు, నృత్య పోటీలు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల వినూత్న రీతిలో శివపార్వతులతో, సోదరుడు కార్తికేయుడితో, హనుమంతుడితో, సతీమణులు సిద్ధిబుద్ధిలతో ఉన్న గణేష్ ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. నంద్యాలలో 800, నందికొట్కూరు 400, శ్రీశైలం 430, ఆళ్లగడ్డ 410, డోన్ 320, పాణ్యం 300, బనగానపల్లె 410 విగ్రహాలను నెలకొల్పినట్లు తెలుస్తోంది. పల్లెల్లో మూడు రోజులు, పట్టణ ప్రాంతాల్లో ఐదు రోజుల పాటు పూజలు చేసిన అనంతరం వినాయక విగ్రహాలను నిర్వాహకులు అందుబాటులో ఉన్న కుంటలు, కాల్వలు, చెరువుల్లో నిమజ్జనం చేయనున్నారు. శనివారం, ఆదివారాలు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు వినాయక మండపాలకు వెళ్లి గణనాథులను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి



వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

బొమ్మలసత్రం: జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచించారు. శనివారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన వినాయక పూజల్లో ఎస్పీ పాల్గొన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో స్థానిక చిన్న చెరువు కట్ట వద్ద పకడ్బందీగా నిమజ్జన ఏర్పాట్లు కొనసాగుతున్నాయన్నారు. విగ్రహాల మంటపాల వద్ద ప్రతి రోజు రాత్రి తప్పనిసరిగా నిర్వాహకులు ఉండాలన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పరిపాలన గణనాథుడికి పూజలు



పూజల్లో పాల్గొన్న కలెక్టర్ దంపతులు

నంద్యాల(అర్బన్): వినాయక చవితి పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో వినాయక చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజకుమారి, శ్రీహరి దంపతులు పాల్గొని పరిపాలన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్వ విఘ్నాలను అధిగమించి జయమును కలిగించే వినాయకుడి ఆశీర్వాదాలతో జిల్లా అభివృద్ధి పథంలో నడవాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ పద్మజ, కలెక్టరేట్ ఏఓ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గణపతి నవరాత్రోత్సవాలు ప్రారంభం



స్వామివారి ఆలయంలో గణపతి స్వామివారికి ప్రత్యేక పూజలు



సాక్షి గణపతి ఆలయం వద్ద మృత్తికా గణపతికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఈఓ దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్థానాచార్యులు, అర్చక స్వాములు, వేదపండితులు, దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు సంప్రదాయబద్ధంగా ఆలయ ప్రాంగణంలోని స్వామివార్ల యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం వేదపండితులు వేదపారాయణలు చేసి వేదస్వస్తి నిర్వహించారు. అలాగే లోక కల్యాణాన్ని కాంక్షిస్తు నవరాత్రోత్సవ సంకల్పాన్ని పఠించారు. సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ నవరాత్రోత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు ఆలయ ప్రాంగణంలోని రత్నగర్భ గణపతి స్వామి వారికి విశేషంగా అభిషేకం, అర్చనలు, జరిపించారు. యాగశాలలోని కాంస్య గణపతిమూర్తికి కూడా విశేష పూజలు జరిపించారు. అలాగే సాక్షిగణపతి ఆలయంలోని స్వామివారికి ప్రత్యేక అభిషేకం, విశేష అర్చనలు చేశారు. పంచామృతాలు, ఫలోదకాలు, శుద్ధజలంతో శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. అలాగే ఉత్సవ రోజుల్లో ప్రతిరోజు స్వామివారికి విశేషపూజలు జరిపిస్తారు. గణపతి నవరాత్రోవాల్లో భాగంగా సాక్షిగణపతి ఆలయంలో నెలకొల్పిన వరసిద్ధి వినాయకస్వామి వారిని (మృత్తికా గణపతి స్వామివారికి) నెలకొల్పడం జరిగింది. అలాగే విశేషంగా పూజాదికాలు నిర్వహించారు. ధర్మప్రచారంలో భాగంగా దేవస్థానం వినాయక చవితిని పురస్కరించుకుని ఉచిత సాముహిక సేవలలో భాగంగా గణపతిపూజ నిర్వహించింది. తెల్లరేషన్ కార్డు కలిగిన వారి సౌకర్యార్థం ప్రవేశపెట్టిన ఉచిత సాముహికసేవల్లో భాగంగా శనివారం చంద్రవతి కల్యాణమండపంలో గణపతి పూజను నిర్వహించారు.



పర్యావరణ రక్షకుడు.. నంద్యాల బాలాజీ కాంప్లెక్స్‌లో పర్యావరణ వినాయకుడు

వైభవంగా స్వాతి మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: అహోబిలం నరసింహ స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం దిగువ అహోబిలానికి భక్తులు పోటెత్తారు. ఉత్సవంలో భాగంగా ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను అమృతవల్లీ అమ్మవార్లను దేవాలయం ఎదురుగా యాగశాలలో కొలువుంచి అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరణచేసి కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం అర్చకులు శ్రీ స్వాతి, శ్రీసుదర్శన హోమాలను వైభవోపేతంగా నిర్వహించి పూర్ణాహుతితో కార్యాక్రమాన్ని ముగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి విశేష పుష్పాలంకరణ గావించిన ఉత్సవ పల్లకీలో ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు మాడ వీధుల్లో సంచరిస్తూ భక్తులను కనువిందు చేశారు.

పండుగకు ఊరెళ్తూ..

- బైక్‌ను ఢీకొన్న ఆల్విన్ వాహనం
- తల్లీకొడుకు మృతి
- మరో వ్యక్తికి గాయాలు





మృతి చెందిన కాంతమ్మ, జగదీశ్వర రెడ్డి

ఆళ్లగడ్డ: వినాయక చవితికి సొంతూరుకు బయలుదేరిన తల్లీకొడుకు మార్గమధ్యలోనే మృత్యువాత పడ్డారు. ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె మెట్ట సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. రూరల్ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల.. మేరకు వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలం నందిపల్లె గ్రామానికి చెందిన మేడిశెట్టి వెంకట కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కొన్నేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలోని షాద్‌నగర్ ప్రాంతంలో తోటలకు కాపలా ఉంటూ జీవనం పొందుతున్నాడు. వినాయక ఉత్సవాల సందర్భంగా వెంకటకృష్ణారెడ్డి ముందుగానే సొంతూరుకు వెళ్లాడు. శనివారం సాయంత్రం షాద్‌నగర్ నుంచి అతని భార్య కాంతమ్మ (37) కొడుకు జగదీశ్వర్‌రెడ్డి (17) కూడా సొంతూరుకు ప్రయాణమయ్యారు. కాగా అదే సమయంలో వెంకటకృష్ణారెడ్డి కుటుంబానికి పరిచయం ఉన్న సుబ్బారావు షాద్‌నగర్ నుంచి వేంపల్లెకు బైక్‌పై వస్తుండటంతో వారిద్దరూ అదే బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో ఆళ్లగడ్డ సమీపంలోని పేరాయిపల్లె మెట్ట సమీపంలోకి వచ్చేసరికి పెబ్బేరు నుంచి కడపకు వెళ్తున్న ఆల్విన్ వాహనం వెనుక వైపు నుంచి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జగదీశ్వర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కాంతమ్మను ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బైక్ నడుపున్న సుబ్బారావు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసుల ద్వారా ప్రమాద విషయం తెలుసుకున్న కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గణేష్ ఉత్సవాల్లో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి



కౌశిక్ (ఫైల్)

డోన్ టౌన్: వినాయక చవితి ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. పట్టణంలోని తారకరామనగర్‌లో వినాయకుని మండపం వద్ద విద్యుత్ ఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. శనివారం ఉదయం చవితి ఉత్సవాల సందర్భంగా మండపాన్ని అందంగా ముస్తాబు చేసి విగ్రహాన్ని కొలువుంచి పూజలు చేశారు. సాయంత్రం వర్షం కురిసి మండపంపై కప్పిన టార్పాలిన్‌పై వాన నీరు నిలిచింది. ఆ నీటిని తొలగించే ప్రయత్నం చేస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగల నుంచి విద్యుత్ సరఫరా అయ్యి విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. వెంటనే అక్కడే స్నేహితులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విద్యుత్‌శాఖ ఏఈ నాగేశ్వరరెడ్డి ప్రమాద వివరాలు తెలుసుకుని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

సూక్ష్మ సేద్యం.. ప్రగతి శూన్యం

- ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరినా ఒక్క హెక్టారుకు మంజూరు కాని వైనం
- కర్నూలు జిల్లాలో 15 వేలు, నంద్యాల జిల్లాలో 15 వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కల్పించాలనేది లక్ష్యం
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఒక సీజన్ కోల్పోతున్న రైతులు



డ్రిప్ ఇరిగేషన్ కింద సాగవుతున్న పంట

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా సూక్ష్మ (బిందు, తుంపర్ల) సేద్యం రైతులకు అందని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వంలో హడావుడే తప్ప ఆచరణ కనపడటం లేదు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రైతులకు సూక్ష్మ సేద్య సదుపాయాన్ని కల్పించాలని నిర్ణయించింది. కర్నూలు జిల్లాలో 15,000, నంద్యాల జిల్లాలో 15,000 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింక్లర్ల సేద్యం కల్పించే విధంగా లక్ష్యాన్ని ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో సూక్ష్మ సేద్యానికి అయ్యే మొత్తం ఖర్చు రూ.134.89 కోట్లు ఉండగా.. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.73.06 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.48.70 కోట్లు భరిస్తాయి. రైతులు నాన్ సబ్సిడీ కింద రూ.13.13 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఐదు ఎకరాలలోపు రైతులకు 90 శాతం, 5 ఎకరాలు పైబడి 10 ఎకరాలలోపు రైతులకు 70 శాతం సబ్సిడీతో బిందు సేద్య సదుపాయం కల్పిస్తారు. ఐదు ఎకరాలలోపు రైతులకు 55 శాతం, 5 ఎకరాలు పైబడి 12 ఎకరాల్లోపు రైతులకు 45 శాతం సబ్సిడీపై తుంపర్ల సేద్యం మంజూరు చేస్తారు.

చురుగ్గా రిజిస్ట్రేషన్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆగస్టు 2 నుంచి రైతులు రైతు సేవా కేంద్రాల్లో చురుగ్గా రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటున్నారు. కర్నూలు జిల్లాలో ఇప్పటి వరకు 10,580 మంది రైతులు 12,196 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం కోసం రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నారు. నంద్యాల జిల్లాలో 9,972 మంది రైతులు 11,257 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కర్నూలు జిల్లాలో బిందు సేద్యానికి, నంద్యాల జిల్లాలో స్ప్రింక్లర్ల సేద్యానికి ఆదరణ ఉంది. రైతుల నుంచి డిమాండ్ ఉన్నప్పటికీ కంపెనీలు ముందుకు రావడం లేదు.. ప్రభుత్వమూ స్పందించడం లేదు. బకాయిలన్నిటినీ చెల్లిస్తేనే బిందు, తుంపర్ల సేద్యం విషయంలో ముందుకు పోతామని డ్రిప్ కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి. కర్నూలు జిల్లాలో 18, నంద్యాల జిల్లాలో 16 కంపెనీలు ఉండగా, కంపెనీల వారీగా లక్ష్యాన్ని ఇచ్చారు. రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న తర్వాత కంపెనీ ప్రతినిధులు రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు బిల్లు ఆఫ్ కొటేషన్(బీవోకే) వేస్తారు. ఇందులో అంచనా వ్యయం, సబ్సిడీ, నాన్ సబ్సిడీ ఉంటాయి. ఈ ప్రక్రియ కూడా నత్తనడకన సాగుతోంది. మరోవైపు రైతుకు రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న విధంగా పొలం ఉందా.. బోరు లేదా బావి ఉందా అనే దానిని కూడ తనిఖీ చేస్తారు. ఒకవైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగా.. మరో వైపు రైతులతో నాన్ సబ్సిడీ కట్టించుకుంటారు.



బిందు సేద్యంతో సాగైన బొప్పాయి

ఒక్క హెక్టారుకూ మంజూరు కాని వైనం...

ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుతున్నా.. ఇంతవరకు ఒక్క హెక్టారుకు కూడా సూక్ష్మ సేద్యం మంజూరు చేసిన దాఖలాలు లేవు. రైతులు నాన్ సబ్సిడీ చెల్లించిన తర్వాత ఏపీఎంఐపీ అధికారులు కలెక్టర్ల నుంచి పరిపాలనా అనుమతుల తీసుకుంటారు. రైతుల నుంచి నాన్ సబ్సిడీ కట్టించుకోవడం మొదలే కానుందున పరిపాలనా అనుమతులకు ఇంతవరకు అవకాశం ఏర్పడలేదు. కర్నూలు జిల్లాలోని ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో బిందు సేద్యం కింద మిర్చి సాగు ఎక్కువగా ఉంటోంది. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడంతో ఈ ఏడాది ఒక్క రైతు కూడా బిందు సేద్యం సదుపాయం పొందలేక పోయారు.

ప్రతిపాదనలు పంపుతాం



సూక్ష్మ సేద్యానికి రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రాథమిక తనిఖీలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు రైతులెవ్వరు నాన్ సబ్సిడీ చెల్లించలేదు. రైతులు నాన్ సబ్సిడీ చెల్లించిన అనంతరం మాకు ప్రతిపాదనలు వస్తాయి. అపుడు పరిపాలనా అనుమతుల కోసం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతాం.

– ఉమాదేవి, ప్రాజెక్టు డైరెక్టర్, ఏపీఎంఐపీ

క్లుప్తంగా

వక్కపై వినాయకుడు



వక్కపై రూపుదిద్దుకున్న వినాయకుడి ప్రతిమ

ఆదోని రూరల్: కమ్మరచేడు జెడ్పీ పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న మల్లికార్జున వినాయక చవితి సందర్భంగా ఆదివారం వక్కపై వినాయకుడి ప్రతిమను రూపొందించాడు. రెండు సెం.మీ. సైజులో ఉన్న వక్కపై వినాయకుడి ప్రతిమను రూపొందించేందుకు గంట సమయం పట్టినట్లు మల్లికార్జున తెలిపారు.

రేపు టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక

కర్నూలు(అర్బన్): స్థానిక చెక్‌పోస్టు సమీపంలోని గుడ్ షెప్పర్డ్ ఇంగ్లిష మీడియం స్కూల్ క్రీడా ఆవరణలో ఈ నెల 10వ తేదీ మంగళవారం జిల్లా సబ్ జూనియర్ టెన్నికాయిట్ జట్ల ఎంపిక జరగనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి రమణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2010 ఏప్రిల్ 1వ తేదీ తరువాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యదర్శి రమణ 7981776081 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పాణ్యంలో కొండచిలువ హల్‌చల్



కొండచిలువ పట్టుకుంటున్న దృశ్యం

పాణ్యం: స్థానిక బస్టాండ్ సమీపంలో కొండచిలువ హల్‌చల్ చేసింది. శనివారం రాత్రి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఉండగా గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. నంద్యాల నుంచి పాణ్యం చేరుకున్న రెస్క్యూటీం సభ్యులు కొండచిలువను బంధించి తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలోని అడవుల్లో వదిలారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

రిటైర్డు సహాయ బీసీ సంక్షేమాధికారి మృతి



కే రాముడు (ఫైల్)

కర్నూలు(అర్బన్): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బీసీ వసతి గృహ సంక్షేమాధికారిగా, పదోన్నతిపై సహాయ బీసీ సంక్షేమాధికారిగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విధులు నిర్వహించిన కే రాముడు ఆదివారం మృతి చెందారు. కృష్ణగిరి మండలం ఎరుకల చెర్వు గ్రామంలో జన్మించిన ఆయన సహాయ బీసీ సంక్షేమాధికారిగా 2011లో పదవీ విరమణ చేశారు. క్రమశిక్షణ కలిగిన వార్డెన్‌గా ఆయన గుర్తింపు పొందారు. ఆయన మృతి పట్ల జిల్లాలోని రిటైర్డువసతి గృహ సంక్షేమాధికారులు కేటీ బాబు, క్రిష్టారెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అలాగే రాముడు మృతి పట్ల జిల్లా కురువ సంఘం నేతలు సంతాపాన్ని వ్యక్తం చేశారు. సంతాపం ప్రకటించిన వారిలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి, అసోసియేట్ అధ్యక్షులు గుడిసె శివన్న ఉన్నారు.

సందేహం.. రోగ భయం!

- ఆరోగ్యంపై ప్రజల్లో పెరుగుతున్న అనుమానాలు
- సోషల్ మీడియాలో పోస్టులతో మరింత బెంబేలు
- ఏ చిన్న లక్షణం కనిపించినా వైద్యుల వద్దకు పరుగు
- మాకు ఫలానా పరీక్షలు చేయించాలంటూ డాక్టర్లకు సలహా
- 20కి పైగా వైద్యపరీక్షలు చేసినా ఫలితం సున్నా
- ఇది మానసిక వ్యాధి లక్షణమంటున్న వైద్యులు



➤ కర్నూలు నగరం గాంధీనగర్‌కు చెందిన లలితకుమారికి ఇటీవల గ్యాస్ పట్టేసినట్లు అనిపించింది. ముందుగా ఆమె ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకుని వచ్చింది. మరునాడు మళ్లీ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు వద్దకు వెళ్లింది. ఆయన ఎండోస్కోపిక్, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఈసీజీతో పాటు మరికొన్ని పరీక్షలు చేయించి రిపోర్టులన్నీ నార్మల్‌గా ఉన్నాయని చెప్పి పంపించారు. ఆ తర్వాత మరో రెండు రోజులకు ఆమె ఛాతీలో బరువుగా ఉందని మరో వైద్యుని వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకోగా ఆమెకు మానసిక సమస్య ఉండటంతో ఇలా ప్రవర్తిస్తోందని వైద్యులు నిర్ధారించారు.

➤ కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన లక్ష్మీదేవికి గుండెలో పట్టేసినట్లు ఉంటే డాక్టర్ వద్దకు వెళ్లి ఈసీజీ తీయించుకున్నారు. ఈసీజీ నార్మల్‌గా ఉందని మందులు వాడాలని వైద్యులు సూచించారు. ఆ మరునాడు మళ్లీ తనకు గుండె దడగా ఉందని, నీరసంగా అనిపిస్తోందని, ఆయాసంగా ఉందని చెప్పడంతో మరో డాక్టర్ వద్దకు వెళ్లి పరీక్షలు చేయించారు. అన్నీ పరీక్షలు నార్మల్‌గా రావడంతో ఏమీ లేదని కంగారు పడాల్సిందేమి లేదని వైద్యులు నిర్ధారించారు.

.. వీరిద్దరే కాదు సమాజంలో ఇలాంటి వారి సంఖ్య ఇటీవల తరచూ పెరుగుతోంది. ఈ మేరకు ఆయా ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. తలనొప్పుందంటే ఎంఆర్‌ఐ, చేయి నొప్పి పెడుతుందంటే హార్ట్ ప్రాబ్లం ఉందని, కాస్త త్రేన్పులు వస్తే గ్యాస్ ఎక్కువైందని ఎండోస్కోపి చేయించుకుంటే మేలనే ధోరణిలో పలువురు తయారయ్యారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో ఆరోగ్య విషయాలకు సంబంధించి తెలిసీ తెలియని వ్యక్తులు ఇచ్చే సూచనలు, సలహాలు ప్రజలను గందరగోళానికి నెట్టేస్తున్నాయి. ఫలితంగా సాధారణంగా మనిషిలో ఏదైనా కనిపించే ప్రతి అరోగ్య అవలక్షణాన్ని భూతద్దంలో చూస్తూ జనం బెంబేలెత్తుతున్నారు. దీనిని వైద్యపరిభాషలో హైపోకాండ్రియాసిస్‌గా పేర్కొంటారు.

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలలోని మానసిక జబ్బుల విభాగానికి ప్రతిరోజూ 100 నుంచి 150 మంది వరకు చికిత్స కోసం వస్తుంటారు. అలాగే ప్రైవేటుగా ఉండే మానసిక వ్యాధి నిపుణుల వద్దకు సైతం ప్రతిరోజూ 400 నుంచి 500 మంది చికిత్స కోసం వస్తారు. వీరిలో 20 శాతం మంది తమకు ఏ జబ్బు లేకపోయినా ఏదో అయ్యిందని మదనపడుతూ వ్యాధి లక్షణాలను బట్టి స్పెషలిస్టుల వద్దకు తిరుగుతూ ఎక్కడా ఎలాంటి పరిష్కారం లభించక చివరకు మానసిక వైద్యుల వద్దకు వస్తున్నారు. ఫలానా చోట సెలూన్‌కు వెళ్లి గుండు/సేవింగ్ చేయించుకుంటే దానివల్ల ఇన్‌ఫెక్షన్ వచ్చిందేమోనని, ఛాతీలో ఎక్కడైనా కొద్దిగా నొప్పిగా ఉన్నా, భారంగా అనిపించినా, గుండె వేగంగా కొట్టుకున్నా హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశం ఉందేమోనని అనుమానం తరచూ వస్తుంటుంది. ఇలాంటి వారు ముందుగా ఆయా వ్యాధి లక్షణాలను బట్టి స్పెషలిస్టుల వద్దకు వెళతారు. అక్కడ అన్ని పరీక్షలు చేయించుకున్నా నార్మల్‌గా ఉందని డాక్టర్ చెప్పినా అనుమానం తీరదు. మళ్లీ ఇంకో డాక్టర్‌ను సంప్రదించి ముందుగా చేసిన పరీక్షలు చూపించకుండా మళ్లీ పరీక్షలు చేయిస్తారు. అక్కడ కూడా నార్మల్‌గా రిపోర్టులు వచ్చినా వారి మనస్సు శాంతించదు. ఏమీ లేకపోతే నాకే ఎందుకు ఇలా జరుగుతోందని వైద్యులను ప్రశ్నిస్తుంటారు. ఇలాంటి వారికి నచ్చజెప్పి చికిత్స చేసేందుకు వైద్యులు చాలా కష్టపడుతుంటారు.

కోవిడ్ తర్వాత మరింత అధికం

ప్రజల జీవనశైలి కోవిడ్‌కు ముందు...ఆ తర్వాత అన్నట్లు తయారయ్యింది. అప్పటి వరకు సాధారణ జీవితం కొనసాగించిన ప్రజలు ఆ తర్వాత ఆరోగ్యానికి సంబంధించి ప్రతి చిన్న విషయాన్ని పట్టించుకుంటున్నారు. ఏ ఒక్క విషయాన్ని నిర్లక్ష్యం చేయడం లేదు. అయితే ఇందులో తెలిసీ తెలియక చాలా తప్పులు చేస్తున్నారు. ఇంటర్‌నెట్‌లో శోధించి, సోషల్ మీడియాలో వచ్చే సమాచారం సరైనదిగా భావించి నమ్మి అనుసరిస్తున్నారు. ఎవరు ఏమి చెబితే దానిని ఆచరిస్తూ ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. మరికొందరు అతిగా మద్యం, గంజాయి, ధూమపానం చేయడంతో పాటు వారంలో నాలుగైదు రోజులు బిర్యానీలు, రోజూ ఫాస్ట్‌ఫుడ్‌లు తింటూ ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. వీటి ఫలితంగా వారి ఆరోగ్య స్థితిగతుల్లో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయాల గురించి పట్టించుకోకుండా ఆరోగ్యానికి సంబంధించి ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే వైద్యుల వద్దకు పరుగులు పెడుతున్నారు. వైద్యులకు వారే ఫలానా వ్యాధి వచ్చి ఉంటుందని, ఈ వైద్యపరీక్షలు చేయాలని, ఫలానా మందులు రాయాలని సూచిస్తున్నారు. వైద్యపరీక్షల్లో ఏమీ లేదని నిర్ధారణ అయినా మరో వైద్యుని వద్దకు వెళ్లి వారికున్న ఆరోగ్య సమస్యల గురించి ఏకరువు పెట్టి మళ్లీ చికిత్స చేయించుకుంటున్నారు. ఇలా వారు ఏ ఒక్క పరీక్షనూ, వైద్యున్నీ సరిగ్గా నమ్మకుండా ఇంట్లో గుట్టలుగా వైద్యపరీక్షలు పేర్చుకుని కూర్చుంటున్నారు. ఏ వైద్యుని వద్దకు వెళ్లినా ఆ పరీక్షలన్నీ తీసుకెళ్లి చూపిస్తున్నారు. ఇది మానసిక జబ్బుని, దీనిని హైపోకాండ్రియాసిస్‌గా పిలుస్తారని వైద్యులు పేర్కొంటున్నారు.

మహిళల్లో పెరుగుతున్న భయాందోళన

ఇటీవల కాలంలో మహిళల్లో భయాందోళనలు అధికమవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ మేరకు ఆందోళన, డిప్రెషన్, గుండెదడ, తీవ్ర మానసిక ఒత్తిళ్లతో వారు చికిత్స కోసం వస్తున్నట్లు వారు పేర్కొంటున్నారు. తనను కుటుంబసభ్యులు, భర్త సరిగ్గా పట్టించుకోవడం లేదని భావించి లేని రోగాన్ని ఆపాదించుకుని వైద్యుల వద్దకు తిరుగుతున్నారు. వారికి వచ్చిన సమస్య నుంచి బయటపడేందుకు ఏదో ఒక ఆరోగ్యసమస్య చెబుతూ ఉంటారు. వారు చెప్పే వ్యాధి లక్షణాలకు తాలూకు వైద్యపరీక్షలు చేయిస్తే ఎలాంటి సమస్య ఉండదు. దీనిని సొమటైజేషన్ డిజార్డర్ అంటారు. ఇలాంటి వారు ఎప్పుడూ అనారోగ్యానికి గురైనట్లు ఉంటారు. వీరికి ఆరోగ్యం బాగైనా కూడా బాగున్నట్లు చెప్పరు. అలా చెబితే మళ్లీ తనను కుటుంబసభ్యులు సరిగ్గా పట్టించుకోరని వారి అనుమానం. ఇలాంటి వాటికి సైకోథెరపీ, మందులు వాడాల్సి ఉంటుంది.

హైపోకాండ్రియాసిస్ బాధితుల సంఖ్య పెరిగింది



ప్రతిసారీ ఏదో ఒక జబ్బు ఉన్నట్లు భ్రమిస్తుంటారు. వైద్యుల వద్దకు వెళ్లి ఫలానా పరీక్షలు రాయాలని ఒత్తిడి చేస్తుంటారు. వారు ఒక డాక్టర్ చికిత్సతో సంతృప్తి చెందరు. ఎలాంటి వ్యాధి లేదని చెప్పినా మళ్లీ మళ్లీ ఇంకో డాక్టర్ వద్దకు వెళ్తుంటారు. వీరిలో భయం, ఆందోళన, డిప్రెషన్ కూడా ఉంటుంది. దీనిని హైపోకాండ్రియాసిస్ అంటారు. సమాజంలో 2నుంచి 5 శాతం మందిలో ఈ సమస్య ఉంది. వ్యాధి తీవ్రతను బట్టి సైక్రియాటిక్ మందులతో పాటు కౌన్సెలింగ్ అవసరం ఉంటుంది. ఇది ఎక్కువగా మధ్య వయస్సులో ఉన్న వారికి వస్తుంది. ఇలాంటి సమస్య వల్ల వారు ఆర్థికంగా, వృత్తిపరంగా నష్టపోతుంటారు.

– డాక్టర్ ఎస్. ఇక్రముల్లా, మానసిక వైద్యనిపుణులు, నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి

అతిగా అవగాహన పెంచుకోవడం వల్లే..

సాధారణంగా వైద్యులు కావాలంటే ఐదున్నర సంవత్సరాలు ఎంబీబీఎస్, స్పెషలిస్టు డాక్టర్ అయితే మరో మూడేళ్లు, సూపర్ స్పెషలిస్టు కావాలంటే ఇంకో మూడేళ్లు చదవాల్సి ఉంటుంది. ఆయా పీజీ సీట్లు సాధించాలంటే రెండు, మూడేళ్లు కష్టపడి చదివి సీటు సంపాదించాల్సి ఉంటుంది. ఈ మేరకు వారికి వైద్యునిగా పూర్తిస్థాయి పట్టా తీసుకునేందుకు 12 నుంచి 15 ఏళ్ల సమయం పడుతుంది. కానీ కొంత మంది ఎలాంటి విద్యార్హత లేకుండా యూ ట్యూబ్‌లు, సోషల్ మీడియాలో ఆరోగ్యం గురించి సూచనలు, సలహాలు ఇస్తుంటారు. వైద్యుల మాట కంటే ఇలాంటి వారు చెప్పే మాటాలు వినేవారు ఇటీవల అధికమయ్యారు. వీరు చెప్పిన విషయాలను చూసి తనకు ఎలాంటి జబ్బు లేకపోయినా ఏదో అయ్యిందని మానసికంగా బాధపడే వారి సంఖ్య అధికమైనట్లు వైద్యులు అభిప్రాయపడుతున్నారు. మీడియాలో వచ్చే వ్యాధులకు సంబంధించి లక్షణాలను ఎవరికి వారు తమకు ఆపాదించుకుంటూ భయంతో వైద్యుల చుట్టూ తిరగడం పరిపాటిగా మారింది. కోవిడ్ అనంతరం ఈ పరిస్థితి మరింత అధికమైంది. కోవిడ్ అనంతరం ఆరోగ్యానికి సంబంధించి సూచనలు, సలహాలు సోషల్ మీడియాలో మరింత అధికమయ్యాయి.

కోవిడ్ అనంతరం ఆందోళన పెరిగింది



కోవిడ్ అనంతరం చాలా మందిలో వారి ఆరోగ్యం పట్ల భయం, ఆందోళన మరింత పెరిగింది. ఫలితంగా ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వారిలో భయం, ఆందోళన పెరుగుతున్నాయి. కోవిడ్ తర్వాత చిన్న వయస్సులోనే గుండెపోటు, స్ట్రోక్ బాధితుల సంఖ్య పెరగడం కూడా దీనికి ఒక కారణం. ఆకస్మిక మరణాలు కూడా ప్రజల్లో ఆందోళనకు ఒక కారణంగా చెప్పవచ్చు. చిన్న జ్వరం వచ్చినా ఆందోళన చెంది వైద్యుల వద్దకు పరిగెత్తే వారి సంఖ్య బాగా పెరిగింది. దీనికితోడు ఒత్తిడితో కూడిన జీవితం ఈ తరంలో అధికమైంది. సోషల్ మీడియాలో సమాచారం చూసి తమ ఆరోగ్యంపై వ్యతిరేక భావాన్ని అన్వయించుకునే వారు ఎక్కువయ్యారు. తక్కువ సమయంలో జీవితంలో స్థిరపడిపోవాలనే వారి సంఖ్య ఎక్కువైంది. ఆకస్మిక మరణాలకు కారణం ఆల్కహాలు, గంజాయి సేవనం కూడా ఒక కారణం. వీటికి దూరంగా ఉంటే ఆరోగ్యం బాగుంటుంది.

–డాక్టర్ ఎస్వీ చంద్రశేఖర్, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

వినాయకున్ని పూజించాలంటే సుంకం చెల్లించాలా?

- హోంమంత్రి అనిత ప్రకటన బాధాకరం
- గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, జోగయ్య శర్మ



మాట్లాడుతున్న గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్

కర్నూలు కల్చరల్: మత స్వేచ్ఛను భంగ పరిచేలా కూటమి ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమని కర్నూలు గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వేణుగోపాల్, ఎం.డి.వి. జోగయ్య శర్మ అన్నారు. ఆదివారం కర్నూలు వినాయక్ ఘాట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ.. వినాయకున్ని పూజించాలంటే సుంకం చెల్లించాలనడం అవివేకమన్నారు. వినాయక మండపాల నుంచి రుసుం వసూలు చేయడం అనాలోచిత నిర్ణయమని పేర్కొన్నారు. రాష్ట్ర హోంమంత్రి వి. అనిత శాంతి భద్రతలు కాపాడాలని, డబ్బులు వసూలు చేసే బాధ్యత కాదని హితవు పలికారు. ఆదోనిలో మండపాల నిర్వాహకులు విగ్రహాల ఏర్పాటుకు అనుమతి అడిగితే బైండోవర్ కేసులు పెడుతున్నారన్నారు. ఇప్పటికే 800 మందిపై బైండోవర్ కేసులు పెట్టడం అమానుషమన్నారు. పత్తికొండలో మూడు రోజుల నిమజ్జనాన్ని ఐదు రోజులు జరుపుకుంటామని చెప్పిన నిర్వాహకులపై బైండోవర్ పెట్టడమేంటని ప్రశ్నించారు. నాగలాపురంలో ప్రతి సంవత్సరం ఐదవ రోజు వినాయక నిమజ్జనం చేస్తుండగా మూడవ రోజే నిర్వహించాలని ఆంక్షలు పెట్టడం హిందూ మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. జోగయ్య శర్మ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం విగ్రహాలకు ఎలాంటి రుసుం చెల్లించబోమని స్పష్టం చేశారు. దేవుని విగ్రహానికి లెక్క కట్టాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. ఆనాటి బ్రిటీష్ పాలనలో మాదిరిగా రుసుం చెల్లించే విధానాన్ని ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధానాన్ని మన రాష్ట్రంలోనే ఈ నిబంధనలు అమలు చేయడమేంటని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అనవసర ప్రమేయంతో హిందువుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాసేలా వ్యవహరించడం తగదన్నారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి దీనిపై పునరాలోచించి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. నగర ప్రధాన కార్యదర్శి జంపాల జనార్దన్ మాట్లాడుతూ.. గణేశ్ మండపాల నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త వెబ్‌సైట్‌ను ప్రారంభించి అనుమతులు ఇవ్వడం సరైందే కాని, చలానా చెల్లించాలనే నిబంధనను ఏకీభవించమన్నారు. సమావేశంలో కేంద్ర సమితి జిల్లా సహ కార్యదర్శి ఎస్.రంగస్వామి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు టీసీ మద్దిలేటి, జిల్లా నాయకులు గూడా సుబ్రహ్మణ్యం, సందడి మహేశ్వర్, ఏవీ ప్రసాద్, బీజేపీ నాయకులు జంపాల యోగానంద చౌదరి, కాశీ విశ్వనాథ్, అక్కెం విశ్వనాథ్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగికి సాయం

అవుకు: రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన సచివాలయ ఉద్యోగికి మండలంలోని పలువురు ఉద్యోగులు ఆర్థిక సాయం అందజేశారు. అన్నవరం సచివాలయ పంచాయతీ కార్యదర్శి గ్రేడ్–5 ఉద్యోగి రాజేష్ బాబు గత నెల 30వ తేదీన పింఛన్ పంపిణీ నగదును తీసుకొచ్చేందుకు అవుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన రాజేష్‌బాబుకు శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. ఈ మేరకు మండలస్థాయి అధికారులు, సహోద్యోగులు కలిసి రూ.1,92,500 జమ చేసి ఆదివారం యువకుడి తండ్రికి అందజేశారు.

సిద్ధాపురం సబ్ స్టేషన్‌లో ఇన్సులేషన్ రాడ్స్ మాయం

ఆత్మకూరురూరల్: సిద్ధాపురం ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సరఫరా చేసే సబ్ స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫారానికి చెందిన రెండు ఇన్సులేషన్ రాడ్స్ మాయమయ్యాయి. వీటి విలువ సుమారు రూ. లక్ష ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. ఇరిగేషన్, విద్యుత్ శాఖ ఏఈలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే విజయవాడ వరద డ్యూటీ తదితర పనులతో బిజీగా ఉన్న పోలీసులు ఈ అంశంపై పెద్దగా దృష్టి సారించినట్లు లేదు. అసలే సబ్ స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా చేసే భూ విద్యుత్ కేబుల్ పలు చోట్ల తెగి పడ్డాయి. వాటిని సరిచేసేందుకు నానా తంటాలు పడుతున్న అధికారులకు ఇన్సులేషన్ రాడ్స్ చోరీ మరింత తలనొప్పిగా మారింది.

డెంగీతో వ్యక్తి మృతి

మహానంది: గోపవరం గ్రామానికి చెందిన రవికుమార్(43) డెంగి బారిన పడి మృతి చెందాడు. వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న రవికుమార్ స్థానికంగా చికిత్స తీసుకున్నప్పటికీ తగ్గకపోవడంతో శనివారం తెల్లవారుజామున నంద్యాలలోని ఓ ఆస్పత్రికి వెళ్లాడు. డెంగీ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించి చికిత్స అందించారు. కాగా కోలుకోలేక మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

దంత వైద్యుల సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలు



సిల్వర్‌జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొన్న దంత వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ డెంటిస్ట్ అసోసియేషన్(రాయలసీమ శాఖ) 40 సంవత్సరాల రూబీ సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. నగర శివారులోని జి.పుల్లారెడ్డి దంత వైద్యకళాశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఉపేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ రాయపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐడీఏ రాయలసీమ శాఖ 1984లో మొట్టమొదటిసారి డాక్టర్ నిసార్ అహ్మద్, డాక్టర్ జార్జిరావు నేతృత్వంలో ప్రారంభమైందన్నారు. ఆ తర్వాత శాఖోపశాఖలుగా విస్తరించి ప్రస్తుత రూపం సంతరించుకున్నట్లు వివరించారు. గతంలో అనేక మంది ప్రెసిడెంట్, సెక్రటరిలుగా సేవలందించారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దావణగేరి డెంటల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి హాజరై ఆధునిక దంత వైద్యం గురించి ప్రసంగించారు. ఎలాంటి స్పెషాలిటీస్ లేని సమయంలో అప్పటి దంత వైద్యులు ప్రజల్లో దంత వైద్యం పట్ల అవగాహన కల్పించారన్నారు. అత్యాధునిక పరికరాలతో వైద్యం చేసే సీనియర్ వైద్యులు నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా ఉండాలని చెప్పారు. అనంతరం ఐడీఏ స్టేట్ సెక్రటరి డాక్టర్ అజయ్‌బెనర్జి, ప్రెసిడెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌లను సన్మానించారు.

హైవే పెట్రోలింగ్ వాహన డ్రైవర్ దుర్మరణం



రాము (ఫైల్)

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హైవే పెట్రోలింగ్ వాహన డ్రైవర్ రాము (34) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజస్థాన్‌కు చెందిన లారీ పోతుదొడ్డి వద్దకు రాగానే మరమ్మతులకు గురై రోడ్డుపైనే నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఎన్‌హెచ్ 44 పెట్రోలింగ్ వాహన డ్రైవర్ రాముతో పాటు సిబ్బంది అభినయ్, వెంకటరాముడు అక్కడకు చేరుకున్నారు. ఆగిపోయిన లారీ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇదే సమయంలో అతివేగంతో వచ్చిన లారీ డ్రైవర్ రాముపై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎన్‌హెచ్ 44 ఇంజనీర్ ప్రవీణ్ చౌదరి, రమేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు రాము వెల్దుర్తి వాసి అని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య వెంకటేశ్వరి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు.

మతిస్థిమితంలేని వ్యక్తి దారుణహత్య



బోయ లోకేష్ (ఫైల్)

కర్నూలు: కర్నూలులోని ఎలుకూరు బంగ్లాలో మతిస్థిమితం లేని బోయ లోకేష్(34) దారుణహత్యకు గురయ్యాడు. కర్నూలు మండలం నిడ్జూరు గ్రామానికి చెందిన లోకేష్ కొన్నేళ్లుగా తల్లితో కలిసి స్థానిక వీకర్ సెక్షన్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కోడుమూరు చెందిన మీనాతో వివాహం అయింది. వీరికి కూతురు, కుమారుడు సంతానం. మీనా భర్తతో గొడవ పడి కొన్నాళ్లు పుట్టినిల్లు కోడుమూరులో ఉంటోంది. లోకేష్ తల్లి కూడా అనారోగ్యంలో నెల రోజుల క్రితం చనిపోయింది. 2016 నుంచి 2023 వరకు లోకేష్ మానసిక పరిస్థితి సరిగ్గా లేక కనిపించిన వారిపై రాళ్లతో దాడి చేస్తుండటంతో పోలీసులు కేసు నమోదు చేసి విశాఖపట్టణం మెంటల్ ఆసుపత్రిలో చేర్పించి వైద్య చికిత్సలు చేయించారు. అయినప్పటికి నయం కాకపోవడంతో తల్లి పోషణలోనే ఉంటున్నాడు. ఎక్కడబడితే అక్కడ తిరుగుతూ కనిపించిన వారిపై దాడి చేయడం.. దూషించడం వంటి వాటికి పాల్పడేవాడు. ఆదివారం ఉదయం కూడా వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన అశోక్ భార్యతో అసభ్యంగా ప్రవర్తించడంతో.. ఆమె భయపడి కేకలు వేసింది. దీంతో ఆమె భర్త అశోక్, అతని స్నేహితుడు జగదీష్‌తో కలసి కత్తి తీసుకొని వెంబడించగా కొంతదూరం పారిపోయాడు. ఇరువురు కలసి లోకేష్ తలపై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలకు గురికాగా... అదే కాలనీకి చెందిన నల్లబోతుల రవికుమార్ చూసి ఆస్పత్రిలో చేర్పించాడు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. అతని సోదరి బోయ ఉసేనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 4వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ హత్య కేసులో నిందితుల అరెస్ట్

- నిందితుల్లో మైనర్ బాలుడు
- గొడ్డలి, రెండు నాటు తుపాకులు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రామాంజినాయక్



స్వాధీనం చేసుకున్న గొడ్డలి, రెండు నాటు తుపాకులు

నందికొట్కూరు: మూడు రోజుల క్రితం నందికొట్కూరులో జరిగిన మహిళ హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం డీఎస్పీ రామాంజి నాయక్ నిందితుల వివరాలను మీడియాకు వెల్లడించారు. స్థానిక మారుతీనగర్‌కు చెందిన గజేంద్ర అనే వ్యక్తి 2015 సంవత్సరంలో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో అదే కాలనీకి చెందిన పింజరి శాలుబీ, మరో మహిళ నిందితులు కాగా, ఈ కేసు కోర్టు విచారణలో ఉంది. ఇంటి పక్కనే ఉన్న శాలుబీ.. తన వైపు చూస్తున్నాడని తరచూ గజేంద్ర కుమారుడు లక్ష్మీనరసింహ అలియాస్ చందును బెదిరించింది. 'మీ నాన్నను చంపినట్లే నిన్ను చంపేస్తాను' అంటూ పలుమార్లు భయపెట్టింది. దీంతో లక్ష్మీనరసింహ శాలుబీని హత మార్చేందుకు మిత్రులతో కలసి పథకం వేశాడు. ఈనెల 6వ తేదీన ఇంట్లో ఒంటరిగా ఉంటున్న శాలుబీని గొడ్డలితో నరికి చంపేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న లక్ష్మీనరసింహపై అనుమానం రావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆదివారం ఉదయం వైఎస్సార్ జంక్షన్ వద్ద వడ్డే లక్ష్మీనరసింహతో పాటు సగినేల వెంకటరమణ, పాలమర్రి సాములు, అన్నయ్యగారి వెంకటేశ్వర్లు, మరో బాలుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో ప్రతిభ చూపిన రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐలు లక్ష్మీనారాయణ, తిరుపాలు, ఓబులేసు, పోలీసులు చెన్నయ్యను ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.